క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు...

హఫీజ్‌పేట్ : పాపిరెడ్డి, చందానగర్ సబ్‌స్టేషన్ల పరిధిలోని 11కేవీ ఫీడర్ల పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు ప్రక్రియలో భాగంగా గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ రాజేందర్ తెలిపారు.

➡ ఉదయం 10.00 గంటల నుంచి మధ్యాహ్నం 1.00 గంట వరకు మార్కెట్ ఫీడర్ పరిధిలో ప్రేమ్‌నగర్ వెనకాల, రోలింగ్ మిడోస్, సీఎం తోట, 100 ఫీట్ రోడ్డు తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామన్నారు.

➡ మధ్యాహ్నం 02.00 గంటల నుంచి సాయంత్రం 05.00 గంటల వరకు ఆర్టీసీ కాలనీ (మైత్రీనగర్) ఫీడర్ పరిధిలో ల్యాండ్ మార్క్ రెసిడెన్సీ, ఆర్టీసీ కాలనీ, జెనిసిస్ స్కూల్, తులసిరాం చాంబర్స్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఆయన వివరించారు.

మియాపూర్ పరిధిలో..
న్యూ కాలనీ, లక్ష్మీనగర్ కాలనీ ఫీడర్ మరమ్మతుల కారణంగా గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ హరిసింగ్ ఓ ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు న్యూ కాలనీ, లక్ష్మీనగర్ కాలనీ ప్రాంతాలు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు లక్ష్మీనగర్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ అపోజిట్, దోవా కాలనీ, ఎస్ఎంఆర్ వినయ్‌సిటీ, నరేన్ గార్డెన్‌లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు.

మదీనాగూడ సబ్ స్టేషన్ పరిధిలో...
భిక్షపతి ఫీడర్ పరిధిలో గురువారం సాయంత్రం 3 గంటల నుంచి 5.30 గంటల వరకు కైలాస్‌నగర్, రోడ్డు నెంబర్ 1 - 6, జవహర్ నగర్, రోడ్డు నెం 2 - 6 తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామన్నారు. విద్యుత్ వినియోగదారులు గమనించి అధికారులకు సహకరించాలని కోరారు.

కూరగాయల ధరలు...

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో కూరగాయల ధరలు కిలో రూపాయల్లో... టమాట 20, పచ్చిమిర్చి 45 , బెండ 40, కాకర 35, దొండ 30, దోస 30, ఆలు 25, చామ 50, కీర 35, బీర 35, వంకాయ 40-55, గోకర 40, బీన్స్ 100, బీట్‌రూట్ 40, క్యాప్సికమ్ 50, క్యాబేజీ 30, క్యారెట్ 60, చిక్కుడు 80, ఉల్లి 30 (1 కేజీ), ములక్కాయలు (2) 10 , క్యాలీ ఫ్లవర్ (1) 30-40, సొరకాయ (కేజీ) 20-30, అల్లం 160, వెల్లుల్లి 160.

విద్యార్థులకు బ్యాగుల పంపిణీ



బ్యాగులను పంపిణీ చేస్తున్న సాయిరాం యాదవ్ తదితరులు

మాదాపూర్: సామాజిక సేవలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని యూత్ క్యాన్ లీడ్ రఘునాథ్ ఫౌండేషన్ చైర్మన్ సాయిరాం యాదవ్ అన్నారు. మాదాపూర్‌లోని ఖానామెట్, ఇజ్జత్‌నగర్‌లలో బుధవారం యూత్‌క్యాన్ లీడ్, రఘునాథ్ ట్రస్ట్ అధ్వర్యంలో ప్రభుత్వ మండల ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు బ్యాగులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూత్ క్యాన్ లీడ్ ద్వారా విద్యార్థులకు బ్యాగులు, చిరువ్యాపారులకు గొడుగులు, ఆటోడ్రైవర్లకు ఉచితంగా హెల్త్ కార్డులను అందజేస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరూ సంపాదనలో కొంత మొత్తాన్ని పేదలకు ఖర్చు చేయాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు భరత్, రాజేశ్, గంగల పవన్, కుమార్, అఖిల్, కొండాగౌడ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



క్రీడలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: మానసికోల్లాసానికి క్రీడలు దోహదం చేస్తాయని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని మైత్రి క్రీడా మైదానంలో జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుంచి విద్యార్థులకు క్రీడలపై ఆసక్తి పెంపొందించేలా ప్రభుత్వం ప్రతి ఏటా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ద్వారా క్రీడలు నిర్వహిస్తోందని తెలిపారు. ఐదు ఎకరాల విస్తీర్ణంతో వివిధ మండలాల్లో మినీ స్టేడియాలు నిర్మిస్తున్నామన్నారు. క్రీడల్లో ప్రతిభ చూపుతున్న క్రీడాకారులను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేవిధంగా సంపూర్ణ సహకారం అందిస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ ప్రభాకర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్, ఎంపీపీలు సుష్మాశ్రీ, దేవానందం, ప్రవీణ విజయభాస్కర్‌రెడ్డి, జెడ్పీటీసీలు సుప్రజ, సుధాకర్‌రెడ్డి, కుమార్‌గౌడ్, మున్సిపల్ చైర్మన్లు పాండురంగారెడ్డి, రోజాబాల్‌రెడ్డి, లలితాసోమిరెడ్డి, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

గణనాథుల నిమజ్జనానికి సర్వం సిద్ధం

- చందానగర్ సర్కిల్ పరిధిలో 6 నిమజ్జన పాయింట్ల ఏర్పాటు
- రూ. 1.44 కోట్లు కేటాయింపు
- కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రత

హఫీజ్‌పేట్: వినాయక చవితి పండుగ సందర్భంగా మండపాల వద్ద గణనాథుల విగ్రహాల ఏర్పాటు చేసి పూజలు నిర్వహిస్తున్నారు. మూడు రోజుల పూజల అనంతరం విగ్రహాల నిమజ్జనాలు ప్రారంభమయ్యాయి. చందానగర్ సర్కిల్ 21 పరిధిలో 6 నిమజ్జనం పాయింట్లను ఏర్పాటు చేశారు. ఇందులో 3 కోనేరులు కాగా, రెండు చెరువులు, ఒకటి తాత్కాలికంగా జీహెచ్ఎంసీ అధికారులు ఏర్పాటు చేశారు. కోనేర్ల వద్ద వచ్చే భక్తులకు అవసరమైన వసతులను కల్పించడంతో పాటు జీహెచ్ఎంసీ అధికారులు నిమజ్జనానికి అవసరమైన ఏర్పాట్లు చేశారు.

నిమజ్జన ప్రాంతాలు ఇవీ...
చందానగర్ సర్కిల్ 21 పరిధిలో చందానగర్ గంగారం పెద్ద చెరువు, హఫీజ్‌పేట్‌లోని కాయిదమ్మ కుంట చెరువు, మియాపూర్ గురునాథం చెరువుల వద్ద కోనేరు, రేగులకుంట, కొత్తకుంట చెరువుల్లో మట్టి వినాయక విగ్రహాల నిమజ్జనం, చందానగర్ పీజేఆర్ స్టేడియంలో ప్రత్యేకంగా బేబీ పాండ్ నిర్మాణం చేపట్టారు.

➡ చందానగర్ సర్కిల్ 21 పరిధిలోని కోనేరుల వద్ద కనీస వసతుల కల్పన, నిమజ్జన ఏర్పాట్లకుగాను రూ.1.44 కోట్లు కేటాయించారు.



గంగారం పెద్ద చెరువు కోనేరు...

➡ కోనేరులను బోర్ల ద్వారా, మరికొన్ని ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా నీటితో నింపారు.

➡ పెద్ద వినాయక విగ్రహాల నిమజ్జనం కోసం గంగారం చెరువు వద్ద రెండు, కాయిదమ్మకుంట వద్ద రెండు, కొత్తకుంట వద్ద ఒకటి, గురునాథం చెరువు వద్ద ఒక్క క్రేన్‌ను సిద్ధంగా ఉంచారు.

➡ భక్తుల కోసం ప్రత్యేకంగా గంగారం కోనేరు వద్ద మొబైల్ టాయిలెట్స్ అందుబాటులో ఉంచారు.

➡ కోనేరులలో నిమజ్జనం చేసిన విగ్రహాలను ఎప్పటికప్పుడు తొలగించేదుకు జీహెచ్ఎంసీ శానిటేషన్ సిబ్బంది ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు.

➡ జీహెచ్ఎంసీ అసిస్టెంట్ ఇంజినీర్, సూపరింటెండెంట్ తదితరులు ఎప్పటికప్పుడు నిమజ్జన వేడుకను పర్యవేక్షించనున్నారు.



గంగారం పెద్ద చెరువు కోనేరు వద్ద ఏర్పాటు చేసిన మొబైల్ టాయిలెట్స్

➡ ప్రతి నిమజ్జనం పాయింట్ వద్ద ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు.

➡ కోనేరు వద్ద చెత్త పేరుకుపోకుండా శానిటేషన్ సిబ్బంది వాటిని తొలగించి ప్రత్యేక వాహనాల్లో డంపింగ్ యార్డుకు తరలింపు చేస్తారు.

కోనేరుల వద్ద అవసరమైన ఏర్పాట్లు చేశాం



చందానగర్ సర్కిల్ 21 పరిధిలో గణనాథుల నిమజ్జనం కోసం 6 నిమజ్జనం పాయింట్‌లు ఏర్పాటు చేశారు. కోనేరుల వద్ద కనీస వసతులు, భారీ వినాయక విగ్రహాల నిమజ్జనం కోసం క్రేన్‌లను ఏర్పాటు చేశాం. 24 గంటల పాటు నిమజ్జనం పాయింట్‌ల వద్ద జీహెచ్ఎంసీ సిబ్బందిని నియమించాం. నిమజ్జనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు తీసుకున్నాం.

– వంశీకృష్ణ, ఉప కమిషనర్, సర్కిల్ 21 చందానగర్

కట్టుదిట్టమైన భద్రత



చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గంగారం చెరువు, పీజేఆర్ స్టేడియం, నల్లగండ్ల, గోపినగర్ చెరువుల వద్ద వినాయక నిమజ్జనం పాయింట్‌లు ఉన్నాయి. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా 24 గంటల పాటు కోనేరుల వద్ద భద్రతా చర్యలు తీసుకుంటున్నాం. 335 వినాయక మండపాల ఏర్పాటు చేసినట్లు సమాచారం ఉంది. వాటికి జియో ట్యాగింగ్ చేస్తున్నాం.

– పాలవెల్లి, సీఐ, చందానగర్ పోలీస్ స్టేషన్

నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన



నిమజ్జన ఏర్పాట్లను పరిశీలిస్తున్న జడ్సీ శ్రీనివాస్ రెడ్డి, చందానగర్ డీసీ వంశీకృష్ణ

హఫీజ్‌పేట్: చందానగర్ సర్కిల్ 21 పరిధిలోని నిమజ్జన పాయింట్ల వద్ద వినాయక విగ్రహాల నిమజ్జనాన్ని శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, చందానగర్ డీసీ వంశీకృష్ణ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ కోనేరుల వద్ద నిమజ్జనానికి అవసరమైన ఏర్పాట్లపై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రతి కోనేరుల వద్ద భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. భారీ వినాయక విగ్రహాల నిమజ్జనానికి అవసరమైన క్రేన్‌లను సిద్ధంగా ఉంచామన్నారు. 24 గంటల పాటు జీహెచ్ఎంసీ సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. పారిశుధ్య కార్మికులు ఎప్పటికప్పుడు భక్తులు తీసుకువచ్చే పూజా వస్తువులను తొలగించాలని ఆదేశించారు. చెరువులు, కోనేరుల వద్ద పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

గాయత్రి బయో కంపెనీలో అగ్నిప్రమాదం



పటాన్‌చెరు టౌన్ : గాయత్రి బయో కంపెనీలో స్వల్ప అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. బుధవారం తెల్లవారుజాము రెండు గంటల సమయంలో పొగ వచ్చి, మంటలు వ్యాపించాయి. దీంతో ఐదుగురు కార్మికులు ఆర్పే ప్రయత్నం చేశారు. ఆపై అగ్నిమాపక అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో పటాన్‌చెరు, పాశమైలారం ఫైరింజన్‌లు ఘటన స్థలానికి చేరుకొని రెండు గంటలు శ్రమించి పూర్తిగా ఆర్పేశారు. మండలంలోని భానూరు నుంచి క్యాసారం వెళ్లే దారిలో ఉన్న ఈ కంపెనీ మాస్క్ బికెట్ తయారీ చేస్తోంది. ఈ ఘటన పై బీడీఎల్ పోలీసుల వివరణ కోరగా ఫిర్యాదు రాలేదన్నారు.

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన





శిల్పారామంలో కూచిపూడి నృత్య ప్రదర్శన

మాదాపూర్: మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న బీహార్ కనెక్ట్ చేనేత హస్తకళా మేళాలో భాగంగా బుధవారం అనూష శ్రీనివాస్ , ఒగ్గు ప్రవీణ్ శిష్యబృందం నిర్వహించిన కూచిపూడి నృత్యప్రదర్శన సందర్శకులను అలరించింది. గజవదన, కులుకగా, నడవరో , రారవేణు, తక్కువ వేమి మనకు, హిందోళం తిల్లాన, బ్రహ్మాంజలి, జతిస్వరం, వినాయకకౌతం, మండూకశబ్దం, కొలువైతివా తదితర అంశాలను ప్రదర్శించి అలరించారు. కార్యక్రమంలో కళాకారులు మాధవి, భావన, సంజిత, లోచన, మానస, ఆశ్రిత, అనుష్క, సాత్విక, హర్షిని , పూర్వి తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతోనే అభివృద్ధి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు టౌన్: సమన్వయం, సమష్టి కృషితోనే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం పటాన్‌చెరు ఎంపీపీ సుష్మాశ్రీ అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా సీఎం కేసీఆర్ దళితబంధు, గృహలక్ష్మి, మైనార్టీ బంధు, బీసీబంధు వంటి పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారని తెలిపారు. పనిచేస్తేనే ప్రజాప్రతినిధులుగా సరైన ఆదరిస్తారన్నారు. ప్రజాస్వామ్యంలో పదవులు శాశ్వతం కాదని, చేసిన అభివృద్ధి పనులే శాశ్వతంగా మిగులుతాయని తెలిపారు. సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలు వెంటనే సమ్మె విరమించి విధుల్లోకి చేరాలని విజ్ఞప్తి చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో మాదకద్రవ్యాల వినియోగం రోజురోజుకు పెరుగుతోందన్నారు. దీంతో ఎక్సైజ్ అధికారులు స్పందించి నిందితులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పటాన్‌చెరు జాతీయ రహదారి నుంచి పెద్దకంజెర్ల మీదుగా దౌల్తాబాద్ బ్రిడ్జి వరకు రూ.18 కోట్లతో రహదారి నిర్మాణం చేపట్టబోతున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం మంజూరు చేసిన స్పోర్ట్స్ కిట్లను త్వరలో పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. జెడ్పీటీసీ సుప్రజ, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్, ఎంపీడీవో బన్సీలాల్, వైస్ఎంపీపీ స్వప్నశ్రీనివాస్, సర్పంచులు ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

15 మందికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన 15 మంది వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు 15 మందికి జరిమానా విధించింది. పటాన్‌చెరు ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సోమ, మంగళవారం నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో 15 మంది వాహనదారులను అదుపులోకి తీసుకొని బుధవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చారు. దీంతో జడ్జి 13 మందికి ఒక్కొక్కరికి రూ.2 వేలు, మరో ఇద్దరికి రూ.3వేల చొప్పున జరిమానా విధించినట్లు తెలిపారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం

- కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి
- నల్లగండ్లలో సీసీ రోడ్డు పనులు ప్రారంభం

శేరిలింగంపల్లి: డివిజన్ పరిధిలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నామని కార్పొరేటర్ వి.గంగాధర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని నల్లగండ్లలో రూ.20 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా గంగాధర్‌రెడ్డి మాట్లాడుతూ కాలనీల్లో మెరుగైన వసతులు కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏఈ సునీల్, నాయకులు గిరి, చందు తదితరులు పాల్గొన్నారు.



నల్లగండ్లలో పర్యటిస్తున్న కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి తదితరులు

వినాయక మండపం ప్రారంభం



వినాయక మండపాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ

హఫీజ్‌పేట్: చందానగర్ డివిజన్ పరిధిలోని ఫ్రెండ్స్ కాలనీలో ఏఎస్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ ఆరవ రామకృష్ణ తన తండ్రి స్వర్గీయ ఆరవ సుబ్బారావు జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన వినాయక మండపాన్ని బుధవారం ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ కార్పొరేటర్లు మంజుల రఘునాథ్‌రెడ్డి, రాగం నాగేందర్ యాదవ్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీ వాసుల సౌకర్యార్థం ఆరవ రామకృష్ణ వినాయక మండపాన్ని నిర్మించడం అభినందనీయమన్నారు. నవరాత్రుల నిర్వహణకు మండపం ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కాలనీలో సమావేశాలకు ఇతర కార్యక్రమాలకు తోడ్పడుతుందన్నారు. ప్రతి ఒక్కరు కాలనీ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు రఘునాథ్‌రెడ్డి, హోప్ ఫౌండేషన్ చైర్మన్ కొండ విజయ్‌కుమార్, నాయకులు ఆదర్శరెడ్డి, వెంకట్‌రావు, ప్రవీణ్, వెంకటేష్, గురు చరణ్ దుబే, భగవాన్, రామరాజు, ప్రసాద్, నరేంద్ర ప్రసాద్, లక్ష్మీనారాయణ, శ్రీకాంత్‌రెడ్డి, ధనలక్ష్మి, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

హనీహనీ కిడ్స్ స్టోర్ ప్రారంభం

గచ్చిబౌలి: కొండాపూర్‌లోని అవెన్యూకాలనీలో హనీహనీ కిడ్స్ రెండవ స్టోర్‌ను బుధవారం ఆనం మీర్జా, మహ్మద్ అసదుద్దీన్‌ప్రారంభించారు. ఈ సందర్భంగా మహ్మద్ అసదుద్దీన్ మాట్లాడుతూ ఒక తండ్రిగా, తన బిడ్డకు ఉత్తమమైన వాటిని అందించేందుకు ఎంతగానో ఇష్టపడతానన్నారు. హనీహనీలాంటి సంస్థ నగరానికి రావడం పట్ల తన లాంటి తండ్రులందరికీ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. చిన్నారులకు అవసరమైన అన్ని ఉత్పత్తులను కొనుగోలు చేసేందుకు వన్‌స్టాప్ కేంద్రంగా నిలుస్తుందన్నారు. బేబీ క్రిబ్‌కాట్, స్త్రోలర్, ప్రామ్, రాకర్, బంక్‌బెడ్స్, బేబీ అల్మరా, బేబీ స్టడీ టేబుల్ మరెన్నో సహా వారి హాట్ సెల్లింగ్ ఐటమ్‌లు ఎందరో ప్రముఖ తల్లిదండ్రుల నుంచి ప్రశంసలు అందుకున్నాయన్నారు. కార్యక్రమంలో కొండాపూర్ స్టోర్ నిర్వాహకులు కిరణ్ కాసరనేని, హనీహనీబిజినెస్ ఆపరేషన్స్ హెడ్, కంపెనీ ప్రతినిధి శ్రీకాంత్ కోమర్ల పాల్గొన్నారు.



హనీహనీ కిడ్స్ స్టోర్‌ను ప్రారంభిస్తున్న ఆనంమీర్జా, మహ్మద్ అసదుద్దీన్

గణనాయకా.. పూజలందుకోవయా..

- వాడవాడలా కొలువుదీరిన గణనాథులు
- భక్తిశ్రద్ధలతో ఉదయం, సాయంత్రం పూజలు....

శేరిలింగంపల్లి జోన్ బృందం: 'జైబోలో గణేష్ మహరాజ్‌కీ జై' వంటి నినాదాలతో వాడవాడలా మారుమోగుతున్నాయి. శేరిలింగంపల్లి జంట సర్కిళ్ల పరిధిలోని కొండాపూర్, గచ్చిబౌలి, శేరిలింగంపల్లి, చందానగర్, మియాపూర్ హఫీజ్‌పేట్, మాదాపూర్ డివిజన్ల లోని కాలనీలు, బస్తీలు, గేటెడ్ కమ్యూనిటీలు, అపార్ట్‌మెంట్లలో వినాయక మండపాల వద్ద సందడి నెలకొంది. ఆయా మండపాల్లో ప్రతి నిత్యం ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. పలు ప్రాంతాల్లో అన్న సమారాధనల కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

- శేరిలింగంపల్లిలోని హుడాట్రేడ్ సెంటర్ గాంధీ ఎస్టేట్స్‌లో ఏర్పాటు చేసిన వినాయకుడి మండపం వద్ద ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్లు రాగం నాగేందర్‌యాదవ్, జగదీశ్వర్‌గౌడ్, రాజుయాదవ్, రామస్వామియాదవ్ తదితరులు ప్రత్యేక పూజలు చేశారు.
- కొండాపూర్, బంజారాబస్తీలో ఆర్‌కేవై ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపం వద్ద బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు రవికుమార్‌యాదవ్ పూజలు చేశారు.
- లక్ష్మీవిహార్‌ఫేజ్-2 కాలనీలో వినాయక పూజల్లో భాగంగా లక్ష్మీగణపతి హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్కృత పండితుడు ఆచార్య డాక్టర్ సూర్యనారాయణను సన్మానించారు. కార్యక్రమంలో కాలనీఅధ్యక్షుడు రవీంద్రప్రసాద్‌దూబే, నర్సింహ్మారావు, సరిత, మాధవి, రామ్మూర్తి, శ్రీనివాస్, వేదపండితులు, కాలనీవాసులు పాల్గొన్నారు.
- శేరిలింగంపల్లిలోని పలు కాలనీల్లో కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఎం రఘునాథ్‌యాదవ్ గణనాథుడి పూజల్లో పాల్గొన్నారు.
- ఖాజాగూడ పోచమ్మగుడి గణేషుడి వద్ద గచ్చిబౌలి మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టిసాయిబాబా స్థానికులతో కలిసి పూజలు చేశారు.



హుడాట్రేడ్ సెంటర్ గణనాథుడి వద్ద పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ రాగంనాగేందర్‌యాదవ్



ఖాజాగూడ పోచమ్మ గుడి గణనాథుడి వద్ద



చందానగర్‌లో..



గణేషుడి పూజల్లో పాల్గొన్న సీనియర్ కాంగ్రెస్ నాయకులు రఘునాథ్‌యాదవ్



కొండాపూర్ బంజారాబస్తీలో..



ఖాజాగూడ మల్లికార్జున భక్త సమాజం ఆధ్వర్యంలో..



నానక్‌రాంగూడలోని భాగ్యలక్ష్మీ అమ్మవారి ఆలయం వద్ద..



రాయదుర్గం శ్యామ్‌లేట్ వీధిలో..